# పశ్చత్తాపము క్షమాపణ యాచించు వాస్తవికత

**హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 25.08. 2023 తేదీన - మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము**

أَشْهَدُ أَنْ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ - أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ○ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రవచించిరి.

అల్లాహ్ తఆలా తన దాసుని పశ్చత్తాపము, క్షమాపణ యాచించుటను ఆమోదిస్తాడు. కాని కేవలం నోటితో పలకడమే కాక నిజమైన పశ్చత్తాపము వ్యక్తపరచవలెను. నిజమైన రీతిలో క్షమాపణ యాచించిన వారికి అల్లాహ్ తఆలా ధనము, సంతానము ప్రసాదిస్తాడని పవిత్ర ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల ప్రస్తావన గలదు. దైవ శిక్ష నుండి తప్పించుకొనుటకు ఇదొక మార్గము.

క్షమాపణ యాచించువాడు దైవ కరుణను ఆకర్షిస్తాడు. క్షమాపణ యాచించువారికి అల్లాహ్ తఆలా ఒక చోట శుభవార్తనందిస్తు ఇట్లు ఉపదేశించెను. **లవజదుల్లాహ తవ్వాబర్రహీమా** అనగా వారు అల్లాహ్ తఆలాను క్షమించేవానిగా, పదే పదే కరుణించువానిగా పొందెదరు. కాని స్వచ్ఛమైన పశ్చత్తాపము తో క్షమాపణ యాచించవలెననే నిబంధన గలదు.

ఒక హదీస్‌లో ఇట్లు గలదు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించినట్లు నేను విన్నానని హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖించారు. పాపము నుండి నిజమైన పశ్చత్తాపము వ్యక్తపరచిన వ్యక్తి ఏ పాపము చేయనివాని వలె మారును. అల్లాహ్ తఆలా ఎవరినైతే ప్రేమిస్తాడో పాపము అతనికి ఎలాంటి నష్టము కలిగించదు. అనగా పాపపు మార్గములు అతనిని పాపము వైపు ఆకర్షించలేవు. పాపపు ఫలితముల నుండి అతణ్ణి అల్లాహ్ తఆలా రక్షిస్తాడు. పశ్చత్తాప లక్షణములను ప్రస్తావిస్తు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి. నిజమైన పశ్చత్తాపము వ్యక్తపరచు వ్యక్తి పాపము నుండి విముక్తి పొందడమే కాక అతనికి అల్లాహ్ తఆలా ప్రేమ లభిస్తుంది, పదే పదే అల్లాహ్ తఆలా కరుణ నుండి భాగము పొందుతాడు.

నిజమైన పశ్చత్తాప నియమములను ప్రస్తావిస్తు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మొదటి నియమము ఏమనగా చెడు ఆలోచనలు, పాప భావములను వీడవలెను. రెండవ నియమము ఏమనగా నిజమైన పశ్చత్తాపము, లజ్జను బహిర్గత పరచవలెను. మూడవ నియమము ఏమనగా ఆయా పాపముల దగ్గరకు వెళ్లనని దృఢ సంకల్పము చేయవలెను. పాపము సమీపమునకు వెళ్లనని ప్రతిజ్ఞ చేయడమే సరిపోవునని భావించక సద్గుణములు, సత్కార్యములు అలవర్చుకోవలెను. ఇదే నిజమైన

పశ్చత్తాపము, స్వచ్ఛమైన లజ్జ. ఈ మార్పు కల్పించుకొన్నప్పుడు అల్లాహ్ తఆలా ఇటువంటి తమ దాసులను ఆదరిస్తాడు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనకు పదే పదే క్షమాపణ యాచించుట, పశ్చత్తాపము గురించి సూచించారు. వారికి ఎంత చింత వుండెననగా ఇటు వైపు జమాఅత్‌నకు సూచించని సందర్భము లేదు. అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త ఉపదేశములు, ఆదేశములకనుగుణంగా ప్రస్తావించిన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వచనములను ఎల్లప్పుడు గుర్తుంచుకొంటూ వాటిని పాటించుటకు కృషి చేయుట మనందరికి చాలా అవసరం. అప్పుడే మనము బైఅత్ హక్కును చెల్లించినవారము కాగలము.

మనము మనలో పవిత్ర మార్పు కల్పించుకొననిచో నిజమైన పశ్చత్తాపము, క్షమాపణ యాచించు వైపు దృష్టి సారించనిచో మనము సంస్కరించుకొంటామని ప్రతిజ్ఞ చేయుట కూడ ఎలాంటి లబ్ది కలిగించదు. వారు (అ) ఇట్లనిరి. మానవుడు తన స్వభావములో చాలా శక్తిహీనుడనే విషయము విధితమే. అల్లాహ్ తఆలా అనేక ఆదేశముల భారము అతనిపై వేయబడెను. కావున అతని బలహీనతల వలన కొన్ని ఆదేశములను పాటించలేక పోవడం అతని స్వభావములోని ఒక భాగము. కొన్ని సార్లు పాపములను ప్రేరేపించు ఆత్మ కొన్ని కోరికలు అతనిపై విజయము సాధిస్తాయి. కనుక అతడు తన బలహీనత, స్వభావము వలన ఏదేని పొరపాటు జరిగినప్పుడు పశ్చత్తాపము, క్షమాపణ యాచించు హక్కు అతనికి గలదు. తద్వారా నాశనము కాకుండా దేవుని కరుణ అతనిని రక్షించును. అల్లాహ్ తఆలా పశ్చత్తాపమును ఆమోదించనివాడైనచో వందలాది ఆదేశముల భారము అతనిపై ఎన్నడు పడకపోవుననే విషయము తథ్యం. అల్లాహ్ తఆలా పశ్చత్తాపమును ఆమోదించువాడు, క్షమాగుణప్రపూర్ణుడని నిస్సందేహంగా దీనితో రుజువగుతుంది. పశ్చత్తాపమనగా ఒక పాపమును విడిచిపెడ్తానని అంగీకరించిన తర్వాత అగ్ని లో పడవేయబడినను మరల ఆ పాపమును ఎన్నడు చేయడు.

ఇది నిబంధన, పశ్చత్తాపము ఇలా వుడవలెను. ఇటువంటి సత్యము, దృఢ సంకల్పముతో మానవుడు అల్లాహ్ తఆలాను ఆశ్రయించినప్పుడు దయామయుడు, కారుణ్యమూర్తి అల్లాహ్ తఆలా అతని పాపమును క్షమిస్తాడు. పశ్చత్తామును ఆమోదించి, వినాశనము నుండి రక్షించుట దేవుని గొప్ప లక్షణములలో ఒకటి.

మేము ఎన్నో సార్లు క్షమాపణ యాచించాము, వంద లేదా వెయ్యి సార్లు తస్బీహ్ చదివామని చాలా మంది అంటుందురు. కాని క్షమాపణ యాచించు భావము అడిగినచో నోట్లో వేలేసుకొని వుండి పోతారు. నాతో జరిగిన పాపములు, నేరముల శిక్ష పడకుంగా అవి క్షమించబడాలని మానవుడు లోలోల క్షమాపణ యాచిస్తుండవలెను. భవిష్యత్తులో పుణ్యములు చేయు అనుగ్రహము పొందాలని, పాపముల నుండి దూరముండాలని హృదయపూర్వకంగా ఎల్లప్పుడు అల్లాహ్ తఆలాతో సహాయము కోరుతుండ వలెను. కేవలం మాటలతో ఏమి సాధించలేరు. గత పాపములను అల్లాహ్ తఆలా క్షమించవలెనని, ముమ్ముందు పాపముల నుండి రక్షించవలెనని, పుణ్యము చేయు అనుగ్రహము పొందవలెనని తమ మాతృభాషలో క్షమాపణ యాచించవచ్చును. ఇదే నిజమైన పశ్చత్తాపము. మనసులో నుండి వెలువడిన విషయమే దేవుని వరకు చేరుతుంది. నాలుక కేవలం మనసులోని మాటకు సాక్ష్యమిస్తుంది. కేవలం నోటి ప్రార్థనలు వ్యర్థమే.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించిరి. ఏదేని ప్రేత్యక విషయమును మన జమాఅత్ చూపించవలెను. ఎవరైనా ఒకరు బైఅత్ చేసి ఎలాంటి ప్రత్యేక విషయమును ప్రదర్శించనిచో గతము మాదిరిగా తమ భార్యతో వ్యవహరించినచో, తమ కుటుంబ సభ్యులతో గతము వలె ప్రవర్తించినచో మంచి పద్ధతి కాదు. బైఅత్ చేయక ముందున్న దుస్థితి, దుష్ప్రవర్తన బైఅత్ తర్వాత సైతం కొనసాగినచో బైఅత్ చేసిన ప్రయోజనమేమి? బైఅత్ తర్వాత ఇతరులతో, తమ బంధువులతో, పొరుగువారితో వ్యవహరిస్తు ఆదర్శంగా వుండవలెను. తద్వారా ఇతడు గతము మాదిరిగా లేడని వారే చెప్పవలెను. నిజమైన ఇస్తిగ్ఫార్ ఫలితము ఇదే కావలెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఇస్తిగ్ఫార్‌ను విమర్శిస్తు వారు సల్లం ఇస్తిగ్ఫార్ చేసినందను వారు పాపము చేశారని రుజువగుతుందని కొందరు అమాయక పాద్రీలు వ్రాశారు. ఇస్తిగ్ఫార్ ఒక గొప్ప లక్షణమని ఈ అమాయకులకు తెలియదు. మానవుడు స్వభావ రీత్యా ఎలా పుట్టాడనగా బలహీనత, లోపము అతని స్వభావములో ఒక భాగమే. సందేశహరులు ఈ సహజ బలహీనత, లోపమును మంచిగా తెలుసుకొంటారు. అందుకే వారిట్లు దుఆ చేస్తారు. ఓ అల్లాహ్! ఆయా మానవ లోపములు బహిర్గతము కాకుండా మమ్ములను రక్షించుము.

నేను నా శక్తితో పాపము నుండి తప్పించుకోగలనని ఎవరు దావా చేయలేరు. కావున ప్రవక్తలు కూడ రక్షణ కొరకు దేవుని అవసరము కలిగి వుంటారు. మానవులై దైవ ప్రార్థన కొరకు ఇతర సందేశహరుల వలె మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూడ అల్లాహ్ తఆలా రక్షణను యాచించేవారు.

యేసు క్రీస్తు ఇస్తిగ్ఫార్ చేసేవారు కాదనే క్రైస్తవుల ఆలోచన తప్పు. వారు పదే పదే తమ లోపాలను అంగీకరిస్తు ఇస్తిగ్ఫార్ చేసినట్లు ఇంజీల్ (క్రొత్త నిబంధన) ద్వారా చాలా స్పష్టంగా తెలుస్తుంది. సరే "ఈలీ ఈలీ లిమా సబఖ్తానీ" అంటే ఏమిటో మీరే చెప్పండి. "అబీ అబీ" (ఓ నా తండ్రి! ఓ నా తండ్రి!) అని ఎందుకు పిలవలేదు. ఇబ్రానీ భాషలో ఈల్ అనగా దేవుడు. దీని అర్థమేమనగా కరుణించి, అనుగ్రహించుము, నన్ను నిస్సహాయునిగా విడిచి పెట్టక నన్ను రక్షించుము.

హదీస్‌లో ఇట్లు గలదు. మానవుడు ఒక్క జానెడు దేవుని వైపు వెళ్లినచో దేవుడు అతని వైపు మూరెడు వస్తాడు. మానవుడు నడుచుకొంటూ వెళ్లినచో దేవుడు పరుగెత్తుకుంటూ వస్తాడు. అనగా మానవుడు దేవుని వైపు దృష్టి సారించినచో అల్లాహ్ తఆలా కూడ కరుణ, అనుగ్రహము, క్షమాగుణములో అనన్న రీతిలో అతనిని కరుణిస్తాడు. కాని దేవుణ్ణి విస్మరించినచో దేవుడెందుకు అతణ్ణి పట్టించుకుంటాడు. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా రెండు నామములను ప్రస్తావించెను. అల్‌హయ్యు, అల్ ఖయ్యూము. అల్‌హయ్యు అనగా దేవుడు సజీవుడు, ఇతరులకు జీవనము ప్రసాదిస్తాడు. అల్ ఖయ్యూమ్ అనగా అతడు స్వయంభువుడు, ఇతరుల జీవిత మనుగడకు కారకుడు. ప్రతి వస్తువు బాహ్యాంతర మనుగడ, జీవితము ఈ రెండు లక్షణముల భ్యాగమే. కనుక **హయ్యు** అను పదము అతణ్ణి ఆరాధించాలని సూచించును. ఈ విషయమును ఫాతిహా అధ్యాయములో **ఇయ్యాక నాబుదు** సూచిస్తుంది. **అల్ ఖయ్యూమ్** అను పదము అతనితోనే సహాయము ఆశించాలని తెలుపుతుంది. **ఇయ్యాక నస్తయీన్** ఇదే విషయమును సూచిస్తుంది. మానవునికి దేవుని అవసరము తప్పక వుటుంది. అందుకే దేవునితో శక్తిని ఆశించుట అనివార్యము. ఇదే నిజమైన ఇస్తిగ్ఫార్.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. సత్కర్మలు, ప్రార్థనలో ఉత్సాహము, ఆసక్తి

స్వంతంగా కలుగలేదు. ఇది దేవుని శుభము, అనుగ్రహముతో లభిస్తుంది. ఇందుకు ముఖ్యమేమనగా మానవుడు కంగారు పడకూడదు. దేవుని అనుగ్రహము, శుభము కొరకు అతనితో దుఆలు చేయవలెను. ప్రార్థనలో ఆసక్తి, ఉత్సాహమును కూడ అల్లాహ్ తఆలాతో యాచించవలెను. ఆయా దుఆలలో అలసిపో కూడదు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తఆలాను విడిచి పెట్టి ఇతర ప్రయత్నములను నమ్ముకొనుట అవివేకమగును. తమ జీవితములలో ఎటువంటి మార్పులు కలిగించుకో వలెననగా ఇస్తిఘ్ఫార్ తర్వాత ఒక నూతన జీవితము లభించినట్లు కావలెను. తరచుగా ఇస్తిఘ్ఫార్ చేయండి. ప్రాపంచిక పనుల వలన సమయము లభించినవారు అందరికంటే ఎక్కువ భయపడవలెను. ఉద్యోగస్తులు అధికంగా దైవ అనివార్య విధులను చెల్లించలేరు. అందుకే తప్పని పరిస్థితితో జుహ్ర్, అస్ర్ ఇలాగే మగ్రిబ్, ఇషా నమాజులను కలుపుకొని చదువుట దర్మబద్ధమే. అనివార్య పరిస్థితిలో మాత్రమే కలుపుకొని చదవండి. కాని తమ నిర్ణీత సమయములో నమాజులను చదువుటయే మేలు. దైవ హక్కులు, ప్రజల హక్కులలో హెచ్చుతగ్గులకు పాల్పడకండి. తమ అనివార్య విధులను ఎంతో నిజాయితీగా చెల్లించండి.

ప్రాథమిక ఆదేశములను గమనిస్తు అనుసరించినప్పుడే ఇస్తిఘ్ఫార్, పశ్చత్తాపము కూడ ప్రయోజనము కలిగించును. క్రమం తప్పకుండా నమాజులను చెల్లించండి, దైవ హక్కులు, ప్రజల హక్కులను కూడ సరిగ్గా చెల్లించండి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ప్రవచించిరి. పశ్చత్తాపము ఆమోదించబడదని అనకండి. మీరు తమ కర్మల వలన ఎన్నడు మోక్షము పొందలేరు. ఎల్లప్పుడు కర్మలు కాక అనుగ్రహమే రక్షించును. మరల ఇట్లనిరి. ఓ పరమ కారుణ్యమూర్తి, దయామయుడైన అల్లాహ్! మమ్ములందరిని అనుగ్రహించుము. మేము నీ దాసులము, నీ ఆస్థానములో పడి వున్నాము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దుఆకు మనందరిని అల్లాహ్ తఆలా వారసులుగా చేయుగాక! మనము పశ్చత్తాపము, ఇస్తిఘ్ఫార్ యదార్థమును అర్థము చేసుకొంటూ ఇస్తిఘ్ఫార్, పశ్చత్తాపము చేయువారమగుదుము గాక!

ఖుత్బా చివరలో హుజూరె అన్వర్ నలుగురు మృతుల సద్గుణములు, జమాఅత్ సేవలను ప్రస్తావించి, జుమా నమాజ్ తర్వాత ఆయా మృతుల పరోక్ష అంత్యక్రియ ప్రార్థణ చదివింతునని ప్రకటించిరి.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِى الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Telugu Desk)*